

బిట్‌కాయిన్‌ల చోరీలో హ్యాకర్ శ్రీకృష్ణ అరెస్టు

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్‌ల హ్యాకర్ శ్రీకృష్ణను తుమకూరు పోలీసులు అరెస్టు చేసినట్లు హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 32 కోట్ల రూపాయల విలువైన 62 బిట్‌కాయిన్‌ల చోరీకి సంబంధించి హ్యాకర్ శ్రీకృష్ణ అలియాస్ శ్రీకి పాత్ర ఉన్నట్లు గుర్తించి సోమవారం రాత్రి శ్రీకృష్ణను అరెస్టు చేశామన్నారు. ఇదో తీవ్రమైన అంశంగా భావిస్తున్నామని, మన రాష్ట్రానికి సంబంధించి బిట్‌కాయిన్‌ల కుంభకోణంపై కేంద్రప్రభుత్వం దర్యాప్తు జరుపుతోందన్నారు.

ఎస్‌ఎస్‌ఎల్‌సీలో బాలికలే టాప్



శ్రియా ఎ.శాస్త్రి (624)

- రాష్ట్రవ్యాప్తంగా 73.40 శాతం ఉత్తీర్ణత
- ప్రథమ స్థానంలో ఉడుపి జిల్లా..చివరలో యాదగిరి
- 625 మార్కులతో స్టేట్ టాపర్‌గా అంకిత బసప్ప
- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రత్యేక అభినందనలు



స్టేట్ టాపర్ అంకిత బసప్ప కొన్నూరు (625)

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల్లో అమ్మాయిలు టాప్ లేపారు. రాష్ట్ర వ్యాప్తంగా 73.40శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి మార్చి 25 నుంచి ఏప్రిల్ 6వరకు సాగిన ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల ఫలితాలను గురువారం పరీక్షామండలి ఛైర్మన్ మంజుశ్రీ, డైరెక్టర్ గోపాలకృష్ణ విడుదల చేశారు. 8,59,967మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,31,204మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,87,416మంది (65.90శాతం) ఉత్తీర్ణత సాధించగా బాలికలు 3,43,788మంది (81.11శాతం) పాస్ అయ్యారు. ప్రథమస్థానంలో ఉడుపి జిల్లా 94శాతం ఉత్తీర్ణత సాధించగా రెండో స్థానంలో దక్షిణకన్నడ 92.1శాతం, మూడో స్థానంలో శివమొగ్గ 88.67శాతం కాగా యాదగిరి జిల్లాలో 50.59శాతంతో చివరిస్థానంలో నిలిచింది.





ఫలితాలు ప్రకటిస్తున్న ఎగ్జామినేషన్ బోర్డు చైర్‌పర్సన్ మంజుశ్రీ, డైరెక్టర్ గోపాలకృష్ణ

గతేడాది కన్నా తగ్గిన ఉత్తీర్ణతా శాతం

గత ఏడాదితో పోలిస్తే ఫలితాల్లో 10.49శాతం ఫలితాలు తగ్గాయి. 2020-21లో 99.99శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నగర పరిధిలో 4,93,900మంది పరీక్షలు రాయగా 359703 మంది (72.83శాతం) ఉత్తీర్ణత సాధించగా గ్రామీణ పరిధిలో 3,66,067 మంది పరీక్షలు రాయగా 2,71,501మంది (74.17శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 8,03,107 మందికిగాను 6,167,665మంది (76.91శాతం)మంది ఉత్తీర్ణత సాధించగా ప్రైవేట్‌గా రాసిన వారిలో 15,479మందికిగాను 1695 (10.95శాతం) మంది, సప్లిమెంటరీలో 32,544మందిలో 10,823మంది (33.26శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్‌గా సప్లిమెంటరీ రాసిన 8,634మందికిగాను 980మంది ఉత్తీర్ణులు కాగా 2010కి ముందు పరీక్షలు రాసిన ప్రైవేట్, సప్లిమెంటరీ అభ్యర్థులు 203మందిలో 41మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 72.46శాతం, ఎయిడెడ్ పాఠశాలలో 72.22శాతం, అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 86.46శాతం ఉత్తీర్ణులయ్యారు.

స్టేట్ టాపర్‌గా బాగల్కోటె విద్యార్థిని

రాష్ట్రంలో టాపర్ స్థానం బాగల్కోటె జిల్లాకు దక్కింది. 625 మార్కులకు 625 మార్కులతో బాగల్కోటె జిల్లా మథోల్ తాలూకా మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని అంకిత బసప్ప కొన్నూరు రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచింది. అన్ని సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధించిన ఏకైక విద్యార్థినిగా నిలిచింది. పలువురు అంకితను ప్రశంసిస్తున్నారు. 624 మార్కులతో ఏడుగురు, 623 మార్కులతో 14మంది, 622మార్కులతో 21మంది, 621 మార్కులతో 44మంది, 620 మార్కులతో 64మంది సత్తా చాటారు.

వందశాతం 2,288 పాఠశాలలు.. జీరోశాతం 78

రాష్ట్ర వ్యాప్తంగా వందశాతం ఉత్తీర్ణతను 2,288 పాఠశాలలు సాధించాయి. ఇందులో ప్రభుత్వం 785, ఎయిడెడ్ 206, అన్‌ఎయిడెడ్ 1297 పాఠశాలలు ఉన్నాయి. జీరో ఫలితాలు సాధించిన వాటిలో ప్రభుత్వ పాఠశాలలు 3, ఎయిడెడ్ 13, అన్‌ఎయిడెడ్ 68 ఉన్నాయి. దివ్యాంగుల్లో 4,660మంది పరీక్షలు రాయగా 2,960మంది ఉత్తీర్ణులయ్యారు.



స్టేట్ టాపర్ అంకిత బసప్ప కొన్నూరుకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

624 మార్కులు సాధించినవారిలో బెంగళూరు దక్షిణ హోలి చైల్డ్ స్కూల్ విద్యార్థిని మేథశెట్టి, శిరకు చెందిన వాసవి విద్యార్థిని హర్షిత డీఎం, బెళ్తంగడి ధర్మస్థళ పాఠశాల విద్యార్థిని చిన్మయి, బెళగావి జిల్లాకు చెందిన సిద్ధాంత్ నాయకోబా గడేజే, శిరసికి చెందిన దర్శన్ సుబ్రయ్ భట్, చిన్మయిషిర్పడె హెగ్డే, ఉత్తరకన్నడ జిల్లాకు చెందిన శ్రీరామ్‌లు ఉన్నారు.



తల్లిదండ్రులతో అంకితా ఆనంద్ (623)



మాన్యతా ఎస్.ఆనంద్ (623)

కరువు ప్రాంతంలో విద్యా వికాసం

బాగేపల్లి, మే 9: కరువుప్రాంతమైన బాగేపల్లిలో విద్యారంగంలో విజేతల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఎస్‌ఎస్‌ఎల్‌సీ ఫలితాల్లో 9వ వార్డుకు చెందిన నాగరాజ్ జీసీ, సరిత దంపతుల కుమారుడు, బీజీఎస్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థి మౌనిష్ (623) మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు.



మౌనిష్

సీఎం అభినందనలు

సీఎం సిద్దరామయ్య, బాగల్కోటే డిప్యూటీ కమిషనర్ కే.ఎం జానకి, జిల్లా పంచాయతీ సీఈఓ శశిధర్ కురేర్ స్టేట్ టాపర్‌కు అంకితను అభినందించారు.



ఈ ఏడాది నుంచే మూడేళ్ల డిగ్రీ

- నాలుగేళ్ల కోర్సును రద్దు చేస్తూ ఉత్తర్వులు
- దేశంలోనే ప్రథమంగా ఎన్‌ఈపీని అమలు చేసిన నాటి బీజేపీ ప్రభుత్వం
- పాత విధానానికే కాంగ్రెస్ సిద్ధం

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి (ఎన్‌ఈపీ) రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో నాలుగేళ్లకు బదులుగా మూడేళ్ల డిగ్రీ విధానాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2021-22 నుంచి వరుసగా మూడేళ్లపాటు డిగ్రీలో చేరి ప్రస్తుతం వివిధ సెమిస్టర్‌లలో చదువుతున్నవారికి రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల డిగ్రీ వర్తించదు. దేశవ్యాప్తంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేసేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి విభాగం నిర్ణయించింది. అప్పట్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఈపీని అమలు చేసేందుకు సిద్ధమైంది. మౌలిక సదుపాయాల విషయంలో సమగ్రంగా ఏర్పాట్లు చేయకున్నా ఎన్‌ఈపీని మాత్రం అమలు చేశారని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఆరోపించింది. అధికారంలోకి రాగానే నాగ్‌పూర్ ఎడ్యుకేషన్ పాలసీని రద్దు చేస్తామని ప్రకటించారు. గత ఏడాది కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్‌ఈపీ రద్దు విషయమై నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. 2021-22 నుంచి ప్రారంభమైన నాలుగేళ్ల డిగ్రీకి స్వస్తి పలికారు. ఎంపిక చేసుకున్న ఆర్ట్స్, సైన్స్, కామర్స్ సబ్జెక్టులతోపాటు ఆప్షనల్‌గా మరో సబ్జెక్టును ఎంపిక చేసుకునే విధానం ఉండేది. ప్రస్తుతం పాత పద్ధతిలోనే డిగ్రీ విధానం రావడంతో విద్యార్థులు మూడేళ్లలో ఆరు సెమిస్టర్‌లుగా చదవాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల వేడి



- నామినేష్ల ప్రక్రియ ప్రారంభం
- తొలిరోజు ఒకే ఒక్కరు
- జేడీఎస్‌తో పొత్తు కొనసాగింపుపై బీజేపీలో అయోమయం..!
- అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యం

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రశాంతంగా గడుపుదామని భావించిన రాజకీయ నేతలకు వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికలు వేడి పుట్టిస్తున్నాయి. మళ్లీ రాష్ట్రంలో ఎన్నికల సెగలు పుడుతున్నాయి. మూడు ఉపాధ్యాయులు, మూడు పట్టభద్రుల స్థానాలకు జూన్ 3న పోలింగ్ జరగనుంది. గురువారం నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. మరో వారం రోజుల్లో నామినేషన్ల విధానం పూర్తి కానుంది. ఇప్పటివరకు లోక్‌సభ ఎన్నికల్లో బిజీగా గడిపిన పార్టీలు అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభించలేదు. ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించడం ద్వారా పరిషత్‌లో పైచేయి సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇదే సమయంలోనే పరిషత్‌లో మెజారిటీ పెంచుకుంటే సభాపతి స్థానాన్ని కైవశం చేసుకోవచ్చునని ఎత్తుగడ వేసింది. ప్రస్తుతం 6 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా మరికొన్ని రోజుల్లోనే 18 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతం పరిషత్ సభాపతితో కలిపి 75మంది సభ్యులు ఉండాల్సి ఉంది. సభలో 70మంది ఎమ్మెల్సీలు ఉండగా ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలతో పలువురు రాజీనామా చేశారు. ఖాళీ అవుతున్న 18 స్థానాలకు సంబంధించి 11మంది ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైనవారు కాగా మిగిలినవారు ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు చెందినవారు. శాసనసభలో 136మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో 8మంది ఎమ్మెల్సీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. బీజేపీ, జేడీఎస్‌ల మైత్రి నలుగురికి మాత్రమే ఎంపిక చేసుకునేందుకు వీలుంది. కాంగ్రెస్‌కు ప్రస్తుతం పరిషత్‌లో 29మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. శాసనసభ కోటాలో 8మందిని గెలిపించుకుంటే మెజారిటీ సాధ్యం కానుంది. ప్రతి నియోజకవర్గానికి ఇప్పటికే ఇద్దరు ముగ్గురి పేర్లతో జాబితా సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపిన బీజేపీ, అగ్రనేతల నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం ఆరు స్థానాలకు జరిగే ఎన్నికల్లో జేడీఎస్‌తో కలసి ముందుకు వెళ్లాలా..? వద్దా..? అనే డోలాయమానంలో బీజేపీ పడింది. జేడీఎస్ తరఫున దక్షిణ ఉపాధ్యాయ నుంచి మరితిబ్బేగౌడ, నైరుతి ఉపాధ్యాయస్థానం నుంచి ఎస్ ఎల్ భోజేగౌడలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరితిబ్బేగౌడ ఇటీవలే జేడీఎస్‌కు రాజీనామా చేశారు. ఇక మిగిలిన నైరుతి ఉపాధ్యాయస్థానం అప్పగించి ఇతర చోట్ల పోటీ చేయాలని బీజేపీ భావించింది. కానీ ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ వివాదంతో ఎన్నికల్లో జేడీఎస్‌తో కసి వెళ్తే మరింత వెనుక బాటు తప్పదనే ఆలోచనలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్నికల ప్రక్రియ ఉంటే బాగుండేదని బీజేపీ భావిస్తోంది.

- ఇక కాంగ్రెస్ దక్షిణ ఉపాధ్యాయ స్థానం నుంచి మరితిబ్బేగౌడకు టికెట్ ఇవ్వనున్నారు. మండ్య, హాసన్, మైసూరు చామరాజనగర్ జిల్లాల పరిధి కావడంతో సీఎం సిద్దరామయ్యకు ఈ స్థానం సవాల్‌గా మారింది. మరో 2-3 రోజుల్లోనే సీఎం, డీసీఎంలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

తొలిరోజు ఏకైక నామినేషన్

విధానపరిషత్‌లో మూడు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. తొలిరోజు గురువారం ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. ఈశాన్యపట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ వేశారు. ఈనెల 16వరకు నామినేషన్‌ల దాఖలుకు గడువు ఉంది. 17న పరిశీలన, 20వ తేదీవరకు ఉపసంహరణ చేసుకోవచ్చు. జూన్ 3న పోలింగ్ జరగనుండగా 6వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు వినతి పత్రం ఇస్తున్న జేడీఎస్ బృందం

సిట్..!

- ప్రజ్వల్ వివాదంలో దారి తప్పుతున్న సిట్
- విచారణ కన్నా ప్రచారానికే ప్రాధాన్యం
- గవర్నర్‌కు జేడీఎస్ ఫిర్యాదు
- నేనూ పెన్ డ్రైవ్ వదులుతా.. కుమార హెచ్చరిక

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంపై విచారణ చేపడుతున్న సిట్ అధికారులు దారి తప్పుతున్నారని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ఆరోపించారు. ఆయన నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు గురువారం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ప్రగతిపై కుమారస్వామి గవర్నర్‌కు వివరించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ కిడ్నాప్‌కు గురైన మహిళను గుర్తించి రోజులు గడుస్తున్నాయని అయినా ఇప్పటివరకు కోర్టుముందు హాజరు పరచలేదన్నారు. తప్పుచేసినవారికి శిక్ష పడాలనే తొలిరోజు నుంచి తన నిర్ణయం ప్రకటించానన్నారు. విచారణ జరుపుతున్న తీరు చూస్తే శిక్షకంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉందన్నారు. దర్యాప్తు ప్రారంభమైన నాటి నుంచి ప్రగతి ఏమిటని ప్రశ్నించారు. కిడ్నాప్‌కు గురైన మహిళను సీఆర్‌పీసీ 162వ సెక్షన్ ప్రకారం విచారణ జరిపారు. కోర్టు ముందు హాజరు పరిచారా? అంటూ ప్రశ్నించారు. ప్రచారం కోసం ఫాంహౌస్ నుంచి తీసుకొచ్చారా..? అంటూ ప్రశ్నించారు. సిట్ సమాచారాన్ని ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. జేడీఎస్ ఎమ్మెల్యేలు జీటీ దేవేగౌడ, భోజేగౌడతోపాటు 40మందికిపైగా ముఖ్యనాయకులు గవర్నర్‌ను కలసిన బృందంలో ఉన్నారు.

నా వద్ద ఉన్న పెన్‌డ్రైవ్ వదుల్తా : కుమార హెచ్చరిక

తన దగ్గర ఉండే పెన్‌డ్రైవ్ వదుల్తానని కుమారస్వామి హెచ్చరించారు. గురువారం ఉదయం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కొన్ని నెలల ముందే బదిలీల విషయంలో జరిగిన అవినీతి చర్చలకు సంబంధించి పెన్‌డ్రైవ్ ఉందని ప్రకటించానన్నారు. అప్పట్లో వదిలినా స్పీకర్ చర్యలు తీసుకుంటారనే నమ్మకం లేదన్నారు. అయినా పెన్‌డ్రైవ్ ఉందని ఎప్పుడైనా వదుల్తానని హెచ్చరించారు. మంత్రి కృష్ణబైరేగౌడ వ్యాఖ్యలపై మాట్లాడుతూ ఎవరో పుట్టరాజు ఉన్నారు కదా... అతను శ్రేయస్‌పటేల్‌ను ఎందుకు కలిశారని ప్రశ్నించారు. డీసీఎం డీకే శివకుమార్‌పై విరుచుకుపడ్డారు. ఏప్రిల్ 21న పెన్‌డ్రైవ్‌లకోసం ఎంత ఖర్చు చేశారో తనకు తెలుసని అన్నదమ్ములు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. దొడ్డహాలహళ్ళిలో బ్లాక్ అండ్ వైట్ టీవీలో ఏం చూపారో అందరికీ తెలుసునన్నారు. మంత్రి మేటి వీడియోలు బహిరంగమైనప్పుడు అప్పటి సీఎం సిద్దరామయ్య రాష్ట్రప్రజలకు క్షమాపణ చెప్పారా అంటూ ప్రశ్నించారు. నాలుగు గోడల మధ్య జరిగినదాన్ని బహిరంగం చేసి హాసన్ మహిళల పరువు తీశారన్నారు. రక్తసంబంధంలో తనకు కొడుకు అని అయినంత మాత్రాన ప్రజ్వల్ తప్పును వెనకేసుకురాలేదన్నారు. వివాదం వెనుక సిద్దూ కేబినెట్ ఉందని ఆరోపించారు.

భవాని రేవణ్ణకు రెండో నోటీసు

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజ్వల్ రేవణ్ణ తల్లి భవాని రేవణ్ణకు సిట్ అధికారులు రెండోసారి నోటీసులు పంపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు కిడ్నాప్‌కు గురైన వివాదంలో రేవణ్ణ జ్యుడిషియల్ కస్టడీలో పరప్పన అగ్రహార జైలుకు వెళ్లారు. కిడ్నాప్‌కు సంబంధించిన ఫిర్యాదులో భవాని రేవణ్ణ పేరు కూడా ఉంది. ఈమేరకు సిట్ అధికారులు విచారణ జరిపేందుకు గత వారమే ఒక నోటీసు జారీ చేశారు. ఆమె ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో రెండో నోటీసును గురువారం వాట్సప్ ద్వారా జారీ చేశారు. ఒకవేళ ఈ నోటీసుకు స్పందించకుంటే మూడో నోటీసు పంపనున్నారు. అప్పటికీ సాధ్యం కాకుంటే భవాని రేవణ్ణను అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

పోలీసులకైనా నో ఎంట్రీ



ఎన్నికల నిర్వహణలో పోలీసులదే కీలకపాత్ర అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా కేంద్రంలోని ఎన్నికల అధికారే పరిష్కరిస్తుంటా రు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు పోలింగ్ కేంద్రంలోనికి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా, ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రతా సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటే ఆగాలి. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏ పని కూడా ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని వారి అనుచరులు కాని చేయకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే పాటించాలి.

\- ముదిగుబ్బ


స్థానిక పోరును తలపించేలా...



స్థానిక పోరును తలపించేలా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్నవారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. అయితే ఈ సారి మాత్రం వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి, ఓటు వేయించేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. అన్ని పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో? ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమా వేశాలు ఏర్పాటు చేసి వలస ఓటర్ల కోసం ఆరా తీస్తున్నారు. అంతకు మించి తాయిలాలు ఇచ్చి ఓటర్లను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

\- ముదిగుబ్బ

ఓటెలా అడుగుతావ్ జగనన్నా..



ఇచ్చిన మాట తప్పితే ఓటేయొద్దని చెప్పావ్‌గా

జిల్లాకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చావని ఓటెయ్యాలి

ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. పరిశ్రమలు తేలేదు

మాట తప్పావ్... మడమ తిప్పావ్

వైసీపీకి ఓటుతోనే బుద్ధి చెప్తామంటున్న ప్రజానికం

అనంతపురం, మే 9(ఆంధ్రజ్యోతి) : 'ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని చెప్పిన దమ్మున్నోడే జగను... చెప్పిన మాట చెప్పినట్లుగా చేసిన మా రాజన్న కొడుకే జగను' అంటూ సాగే పాట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన ప్రతి బహిరంగ సభలోనూ వినిపిస్తోంది. అయితే ఆ పాటలో చెప్పినట్లుగా జగన్ ఏమాత్రం చేయలేదని జిల్లా ప్రజానికం మండిపడుతోంది. మాట తప్పం... మడమ తిప్పమని ప్రతి సభలోనూ ఘీంకరించే సీఎం జగన్ జిల్లాకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నది నిర్వివాదాంశం. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. మద్యపాన నిషేధాన్ని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలోనే ఇచ్చిన మాట తప్పావ్... మరి నీ పార్టీకి ఓటెలా వేయాలని అడుగుతావ్ జగన్ అంటూ జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది. మాట తప్పిన... మడమ తిప్పిన జగన్‌కు ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్తామంటోంది.

ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పాదయాత్ర చేశారు. ముఖ్యమంత్రి హోదాలోనూ బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో అనేక సభలు నిర్వహించారు. ఈ జిల్లా మనవడినంటూ... కరువు జిల్లాను అన్ని విధాలుగా ఆదుకుంటానని అనేక హామీలిచ్చారు. ఆ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా..? అంటూ జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది.

- జీడిపల్లి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకు రూ. 986 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు రూ. 200 కోట్ల పరిహారం వారం రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తానని కళ్యాణదుర్గం సభలో చెప్పావ్.. ఇప్పటి వరకూ నెరవేర్చలేదు.
- కృష్ణాజలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు మళ్లిస్తానని హామీ ఇచ్చి మూడేళ్ల కాలం పూర్తయినా ఇప్పటికీ హామీగానే మిగిలిపోయింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే... రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరందేది. అదీ చేయలేదు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో టీడీపీ హయాంలో చేపట్టిన నేమకల్లు ఆంజనేయస్వామి బాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇస్తివి. ఇప్పటికీ నెరవేర్చలేదు. జగన్ హామీ ఇస్తే నెరవేరుతాయని బొమ్మనహాళ్, కణేకల్లు, డి. హీరేహాళ మండలాల ఆయకట్టు రైతులు ఆశించారు. కానీ రైతన్నల ఆశలు ఆవిరి అయ్యాయి.
- జిల్లాకు సాగు, తాగునీరందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తామని గొప్పగా చెబితివి. ఐదేళ్లలో గంప మట్టయినా తీయలేదు.
- చాగల్లు రిజర్వాయర్ నిర్మాణంతో ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించారు. ఉల్లికంటిపల్లి గ్రామ ప్రజలకు పరిహారం కింద కొంత సొమ్ము మాత్రమే చెల్లించారు. నూతనంగా గ్రామాన్ని ఏర్పాటు చేసి గృహనిర్మాణాలు చేయించారు. ఆ గృహనిర్మాణాలకు ఇప్పటివరకూ నిధులివ్వలేదు. ఉల్లికల్లు గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు ఆ గ్రామాన్ని వదల్లేక.. ఉండలేక అవస్థలు పడుతున్నారు.
- శింగనమల నియోజకవర్గంలో ఉద్యానపంటలు పండించే రైతులకు ఆదాయం పెంచేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు.
- ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా ఉపకాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో ఆందోళన చేపట్టావు... అధికారంలోకి రాగానే విస్మరించావని ఆ ప్రాంత రైతులు నిలదీస్తున్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో దేవరకొండ జలాశయంతో పాటు మరో రెండు రిజర్వాయర్లకు నాలుగేళ్ల కిందట వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసింద్దైనా గుర్తుందా జగనన్నా అంటూ ఆ నియోజకవర్గ ప్రజలు నిలదీస్తున్నారు.

ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని మీరే చెప్పారు. మరి ఓటేయమని ఇప్పుడు ఎలా అడుగుతున్నావ్ జగనన్నా అంటూ జిల్లా ప్రజానికం మండిపడుతోంది.

జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటెయ్యాలి..?

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా లోటు బడ్జెట్ ఉన్నా... ఆగమేఘాల మీద గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి, దాని ద్వారా నీటి సౌకర్యం కల్పించి కియతో పాటు అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యేలా టీడీపీ అధినేత చంద్రబాబు కృషి చేశారు. కియ ద్వారా ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పుకునేందుకు తెలుగుదేశం పార్టీకి నైతికత ఉందన్న అభిప్రాయం జిల్లా ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. మరి కరువు జిల్లాకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా? ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ హయాంలో అనంతపురం నగర శివారులో దాదాపు 6 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమను నెలకొల్పేందుకు ఆ సంస్థ ప్రతినిధులు సిద్ధమయ్యారు. అయితే అప్పటి ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడం... ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎందుకు ఆ పరిశ్రమను ఏర్పాటు చేయలేకపోయిందో బదులివ్వగలరా అని ప్రజలు నిలదీస్తున్నారు. కాసుల కాంక్షతో అధికార వైసీపీ నేతలు ఆ పరిశ్రమ ప్రతినిధులపై ఒత్తిడి తేవడంతోనే పరిశ్రమ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిందన్నది నిజం కాదా అని నిలదీస్తున్నారు. ఎంతసేపూ బటన్ నొక్కుడుతో సంక్షేమం చేపట్టామని చెబుతున్నారేగానీ... జిల్లా అభివృద్ధికి బాటలు వేయలేదన్నది నిజం కాదా అని వైసీపీ ప్రభుత్వాన్ని జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టులు పూర్తయింటే ప్రతి ఎకరాకు సాగునీరు అందడం ద్వారా మా జీవితాలు బాగుపడేవన్న భావన జిల్లా రైతాంగం నుంచి వ్యక్తమవుతోంది. ఆ హామీలు నెరవేర్చకుండా మా జీవితాలతో చెలగాట మాడారనే ఆక్రోశం వారిలో వ్యక్తమవుతోంది. జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటేయాలని ఆ వర్గాలు వైసీపీని నిలదీస్తుండటం గమనార్హం.

రేయ్.. పరిసిపారేయండ్రా..!

- తాడిపత్రిలో ఓటుకు రూ.2 వేలు
- ఇప్పటికే 95 శాతం పంపిణీ పూర్తి..?
- అవసరమైతే ఇంకో కోటా ఉంటుందట..!

తాడిపత్రి టౌన్, మే 9: రాష్ట్రంలో ఉత్కంఠ రేపే నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో డబ్బులను పరిచి పడేస్తున్నారు. 'ఓటు ఎవరికైనా వేసుకో.. నువ్వు ఏ పార్టీ అయినా సరే.. నోటు తీసుకో..' అని మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. ప్రలోభాలు పీక్స్‌కు చేరాయి. ఓటుకు రూ.2 వేల ప్రకారం ఇప్పటికే పంపిణీ పూర్తి అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాడిపత్రి మున్సిపాలిటీతోపాటు గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్‌కు మూడు రోజుల ముందే ఈ స్థాయిలో డబ్బులను పంచడం కలకలం రేపుతోంది. నియోజకవర్గంలో ఇప్పటికే వంద కోట్లు పంచేశారని అంటున్నారు.



ఎందుకంటే..

తాడిపత్రి నియోజకవర్గం జేసీ కుటుంబం కంచుకోట. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇక్కడ మాత్రం జేసీ కుటుంబం జెండా ఎగరాల్సిందే అన్నట్లు రాజకీయం కొనసాగుతోంది. అంచనాలకు భిన్నంగా గత ఎన్నికల్లో మాత్రం ఓటమి ఎదురైంది. కానీ పడిలేచిన కెరటంలా మున్సిపల్ ఎన్నికల్లో జేసీ కుటుంబం సత్తా చాటుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచినా.. తమ అడ్డాలో మాత్రం కుదరదని 'సైకిల్' సంకేతం పంపింది. దీంతో ఈ ఎన్నికల్లో గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎలాగైనా విజయం సాధించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలో ఓటర్లకు భారీగా డబ్బులు, చీరలు, ముక్కుపుడకలు వంటి కానుకలు చేరుతున్నాయి.

ఎంతైనా సరే..

తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2,48,880. వీరిలో సాధ్యమైనంత మందికి డబ్బులు పంపిణీ చేయాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఓటుకు రూ.2వేలు పంపిణీ చేశారని బహిరంగ చర్చ నడుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో నగదుతోపాటు కానుకలు కూడా ఇస్తున్నారట. ఇవికాక.. గంపగుత్త ఓట్ల కోసం పెద్ద ఎత్తున డిన్నర్లకు సిద్ధమవుతున్నారు. 'ఇప్పటికే పంచేశాం. ఇంకా అవసరమైనా ఇచ్చేద్దాం. ఏం జరుగుతోందో నిఘా వేయండి..' అని కిందిస్థాయి నాయకులను పురమాయించినట్లు తెలిసింది. మిగిలిన మూడు రోజులు ఓట్లు, మద్యం, కానుకల జాతరేనని అంటున్నారు.

బయటివారే సేఫ్

ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి లెక్కాజమ ఉండదు. ఇచ్చిన సొమ్ము ఓటర్లకు చేరుతోందో లేదో తెలియదు. అందుకే లోకల్ వద్దు.. నాన్ లోకల్ మేలు అని అధికార పార్టీవారు బయటివారిని రప్పించినట్లు సమాచారం. సాధారణంగా చీకటి పడ్డాక, అర్ధరాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా డబ్బుల పంపిణీ జరుగుతుంది. కానీ ఈ ఎన్నికల్లో 'మమ్మల్నెవరు ఆపేది..?' అన్నట్లుగా అధికార పార్టీవారు పట్టపగలే డబ్బులను పంచేస్తున్నారు. అధికారులు పట్టించుకోడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంటన్నరలో అయిపోవాలి..!

అనంతపురం క్రైం: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో డబ్బుల పంపిణీకి అధికార పార్టీ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నాయకులు నోట్ల కట్టలను బయటకు తీస్తున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే పంపిణీ మొదలైంది. ఎక్కువ ప్రాంతాల్లో పోలింగ్‌కు రెండు రోజుల ముందు పంచాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత రోజు చుక్క, ముక్క ఏర్పాటు చేస్తారని సమాచారం. 2019 ఎన్నికల్లో కూడా వైసీపీ నాయకులు ఇదే వ్యూహాన్ని అమలు చేశారు. అంత ఉత్కంఠ లేని ప్రాంతాలలో ప్రత్యర్థుల ఎత్తుగడలను పసిగట్టి.. అవసరమైతే ఓటుకు రూ.1500 పంచడానికైనా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గట్టి పోటీ ఉన్నచోట్ల ఎంత పంపిణీ చేస్తారో అంచనాలకు అందడం లేదని జనం వ్యాఖ్యానిస్తున్నారు. పంపిణీ బాధ్యతలు తీసుకున్న కీలక నేతల అనుచరవర్గాలు స్థానిక నాయకులకు కొన్ని సూచనలు ఇచ్చారట. తమ సమక్షంలో డబ్బులు పంచాలని షరతు పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంట్లో ఎన్ని ఓట్లున్నాయో గుర్తించి, నిమిషాల వ్యవధిలో డబ్బులు ఇచ్చేయాలని.. ఊరు మొత్తం గంట.. గంటన్నరలోగా పంపిణీ పూర్తవ్వాలని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పెద్ద గ్రామమైతే మరో అరగంట టైమ్ తీసుకోవాలని, అంతకంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సెలవిచ్చారట.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



కురుబల సమావేశానికి హాజరైన బాలకృష్ణ, బీకే పార్థసారథి

సైకో ప్రభుత్వంతో రాష్ట్రం అల్లకల్లోలం

అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలి

ఎన్నికల ప్రచారంలో బీకే పార్థసారథి

హిందూపురం, మే 9 : సైకో పాలనతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, ప్రజలకు సంక్షేమం ఒకటే సరిపోదని అభివృద్ధి కూడా ముఖ్యమని తెలిపారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ ఒక్క పనికూడా చేయలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా ఉమ్మడి ప్రభుత్వంతో సాధ్యం అవుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

రాష్ట్రంలో కురుబ కులస్థులు తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని, వారికి కూడా పార్టీ అండగా ఉంటూ పెద్దపీట వేస్తోందని బీకే పార్థసారథి అన్నారు. హిందూపురం జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కురుబలకు పెద్దపీట వేసిందన్నారు. తాను పంచాయతీ స్థాయి నుంచి ఎంపీ వరకు ఎదిగానంటే తెలుగుదేశం పార్టీయే మూలమన్నారు. పార్టీ ఎప్పుడూ బడుగు బలహీనవర్గాల కోసం కృషి చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా కులస్థులకు చంద్రబాబు, బాలకృష్ణ అండగా ఉంటారని మనమంతా టీడీపీని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోరంట్ల ప్రచారంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువులకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోరంట్లలో తెలుగుదేశం పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ మాట్లాడుతూ వైసీపీ కమీషన్లకు కక్కుర్తి పడటంతో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గోరంట్ల మండలంలో ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



గుత్తిలో డీజిల్ షెడ్‌లో కార్మికులతో అంబికా లక్ష్మీనారాయణ



యాడికి సమావేశంలో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

గుత్తి, మే 9: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అనంతపురం లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన డీజిల్ షెడ్, సీఅండ్‌డబ్ల్యుతో పాటు పలు విభాగాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు. అనంతరం ఆయన కార్మికులతో మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధితో పాటు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఏర్పాటుకు, రైల్వే ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డీజిల్ షెడ్ నుంచి మెయిన్ రోడ్డులో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడాలంటే టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ముష్టూరు తిమ్మప్ప, ఎంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్, డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జావిద్, జనసేన నాయకులు పూల రమణ, గోవింద రాజులు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌చౌదరి, వీరన్న, రాము, వెంకటరాముడు పాల్గొన్నారు.

పోరాడితే విజయం మనదే

యాడికి : పోరాడితే విజయం మనదేనని అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం యాడికిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి అతికొద్ది సమయం మాత్రమే ఉందని, అంతా కలిసికట్టుగా పోరాడితే కూటమి అభ్యర్థులదే విజయమని తెలిపారు. ప్రతిఓటరును కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఓటింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన పెంచాలని తెలిపారు. పోలింగ్ రోజున వైసీపీ కుట్రలకు తెరలేపడానికి సిద్ధమవుతోందని, వాటిని దీటుగా ఎదుర్కోగలిగితే విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు రాజశేఖర్‌నాయుడు, ఆదినారాయణ, విక్రమ్, నరసింహచౌదరి పాల్గొన్నారు.

తాగుదాం.. ఊగుదాం..!

ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నగరంలో గత కొన్ని రోజులుగా దుకాణాలు తీయడమే ఆలస్యం అక్కడ ఇట్టే మద్యం ప్రియులు వాలిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం నుంచే మద్యం ప్రియులు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం బరిలో నిలిచిన అభ్యర్థులు అటు ప్రచారం.. ఇటు ఓటు కోసం డబ్బులు పంపిణీ చేస్తుండటం మద్యం ప్రియులకు కలిసి వచ్చినట్లైంది. కొందరైతే వివిధ పార్టీల జెండాలు, కండువాలు, టోపీలతో దుకాణాల వద్ద కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు మద్యం ప్రియులు తాము చేసే పనులు పక్కన బెట్టి డబ్బు, మద్యం కోసం అభ్యర్థుల చుట్టూ తిరుగుతున్నారు. మద్యం దొరగ్గానే పూటుగా తాడి ఊగేస్తున్నారు.

\- అనంతపురం సిటీ



నగరంలోని ఓ మద్యం దుకాణాల వద్ద ఇలా...



చీనీ మార్కెట్ బంద్

అనంతపుంరూరల్, మే 9: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ యార్డు ఉద్యోగులు, సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించిన కారణంగా ఈనెల 12న (ఆదివారం) ఎద్దులు, ఎనుముల సంత, 13న (సోమవారం) చీనీ కాయల మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ రెండు రోజులు చీనీకాయలు, పశువులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఆమె సూచించారు.

ఓటు అమ్ముకోం.. భవిష్యత్తును పోగొట్టుకోం

ఎన్నికల వేళ... ఒక ఉపాధ్యాయుడు వినూత్నంగా ఓటు విలువపై ప్రచారం చేశారు. ఓటును అమ్ముకోం. ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును పోగొట్టుకోలేమని చెబుతూ తన ఇంటిపై ఫ్లెక్సీ అతికించారు. ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ అనంతపురంలోని జీసస్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన ఇంటిపైన ఒక ఫ్లెక్సీని పెట్టించారు. ఓటు హక్కును నిజాయతీగా వినియోగించాలని, జీవుల మనుగడకు ప్రాణవాయువు ఎలాగో... ప్రజాస్వామ్యానికి ఓటు ఆక్సిజన్ వంటిదని సూచిస్తూ... ఫ్లెక్సీ అతికించారు. ఉద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తికే ఓటు వేస్తామని అందులో స్పష్టం చేశారు. ఆయన వినూత్న పంథా, ఓటుపై ప్రచారం అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది.

\- అనంతపురం విద్య




ఇంటికి తగిలించిన ఫ్లెక్సీ వద్ద విజయ్‌భాస్కర్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

యుక్తేశ్వర్ గిరి (జయంతి)




ప్రముఖ ఆధ్యాత్మిక గురువు యుక్తేశ్వర్‌గిరి 1855 మే 10న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సీరాంపూర్‌లో జన్మించారు. అసలు పేరు ప్రియానాథ్ కరార్. 'ఒక యోగి ఆత్మకథ' రాసిన పరమ హంస యోగానందకు గురువు. లాహిరి మహాశయులు యుక్తేశ్వరకు క్రియాయోగ దీక్షనిచ్చి శిష్యులుగా తీసుకున్నారు. 1894లో కైవల్య దర్శనం' (ది హోలీ సైన్స్) పేరిట పుస్తకాన్ని విడుదల చేశారు. సంస్కృతం, అంగ్లం, ఫ్రెంచ్, బెంగాలీ, హిందీ భాషలను ధారాళంగా మాట్లాడేవారు. అంగ్ల, సంస్కృత భాషలను సులభంగా నేర్చుకోవడానికి తాను స్వయంగా రూపొందించిన బోధనా పద్ధతులను విద్యార్థులకు వివరించేవారు. భగవద్గీత, ఉపనిషత్తులను, క్రియా యోగాను విస్తృతం చేశారు. 1936 మార్చి 9న మహాసమాధి అయ్యారు.

పంకజ్ మల్లిక్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పంకజ్ మల్లిక్ 1905 మే 10న కోల్కత్తాలో జన్మించారు. బెంగాలీ సంగీత స్వరకర్త, నేపథ్యగాయకుడు. బెంగాలీ, హిందీ సినీరంగంలో పేరొందారు. సినీ రంగంలో ఆయన చేసిన సేవలకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందారు. ఆలిండియా రేడియోలో కెరీర్‌ను ప్రారంభించి 38ఏళ్లపాటు బెంగాలీ, హిందీ, ఉర్దూ, తమిళ భాషలలో సినిమాలలో రాణించారు. కేఎల్ సైగల్, ఎస్‌డీ బర్మన్, గీతా దత్, ఆశా భోస్లే వంటి ప్రముఖులతో కలసి పనిచేశారు. 'న్యూ థియేటర్స్ కోల్కత్తా'కు 25 ఏళ్లపాటు పనిచేశారు. 1978 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

ఇబ్రహీం సుతార్ (జయంతి)



కన్నడ కబీర్‌గా పేరొందిన ఇబ్రహీం సుతార్ 1940 మే 10న బాగల్కోట జిల్లా మహాలింగపూర్‌లో జన్మించారు. 1970లో 'భావైక్య జానపద సంగీత మేళా' ను ఏర్పాటు చేశారు. హిందూ, ముస్లిం యువత కర్ణాటక వారు మాత్రమే కాక పొరుగు రాష్ట్రాలవారు కూడా ఇందులో సభ్యులుగా ఉండి పాటలు పాడేవారు. ఆయన వందలాది పద్యాలు, రచనలు చేశారు. అథణి తాలూకాలోని శేగుణశి గ్రామస్తులతో కలసి 9 కిలోమీటర్ల రహదారి ఏర్పాటు చేశారు. 1995లో రాజ్యోత్సవ పురస్కారం, 2018లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 2022 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

సునీత (పుట్టినరోజు)



నేపథ్య గాయనిగా రాణించిన సునీత ఉపద్రష్ట 1978 మే 10న గుంటూరులో జన్మించారు. తొలుత టీవీ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, డబ్బింగ్ కళాకారిణిగా, సహాయ దర్శకురాలుగా పలు బాధ్యతలు నిర్వహించారు. 15యేటనే సినీరంగంలో గాయనిగా ప్రవేశించారు. గులాబి, ఎగిరే పావురమా సినిమాలు ఆమెకు ఎంతో పేరు తెచ్చాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలలో 3వేలకుపైగా పాటలు పాడారు. 2020లో 'నీలి నీలి ఆకాశం' పాట ఎంతో పేరొందింది. 750కుపైగా సినిమాలకు 110 మందికిపైగా డబ్బింగ్ చెప్పారు. ఒక ఏడాదిలో 60 సినిమాలకు డబ్బింగ్ చెప్పిన ఖ్యాతి పొందారు. వివిధ కేటగిరీలలో 9 నంది అవార్డులు, 2 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ పురస్కారాలు అందుకున్నారు.

పెండ్యాల హరికృష్ణ (పుట్టినరోజు)



పెండ్యాల హరికృష్ణ 1986 మే 10న గుంటూరు జిల్లాలో జన్మించారు. చదరంగం క్రీడాకారుడు విశ్వనాథన్ తర్వాత దేశంలో ఇతను రెండోస్థానంలో కొనసాగుతున్నారు. 1996లో ప్రపంచ అండర్ 10 ఛాంపియన్‌గా నిలిచారు. 2001లో అతిపిన్న వయస్సులో గ్రాండ్ మాస్టర్‌గా రికార్డు నెలకొల్పారు. ఈ రికార్డును పరి మార్జిన్ నేగి 2006లో అధిగమించారు. 2004 నవం బరులో ప్రపంచ జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించారు. 2016 పీక్ రేటింగ్‌లో 2,768 పాయిం ట్లతో వరల్డ్ టాప్ 10 ప్లేయర్స్ జాబితాలో చేరారు. 2020లో 'చెస్ 960'లో 7 ఆటలకు గాను 5.5పాయింట్స్ సాధించారు. రష్యా ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించారు. ఫైడ్ గ్రాండ్‌ప్రిక్స్ 2022లో కూడా ఆడారు. 2023 మేలో 2704 పాయింట్‌లతో నిలిచారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, మే 9: గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో (50)సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర గురువారం తెలిపారు. బుధవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు.

సాగులో ఆధునికీకరణ సరళీకృతం కావాలి

▸▸ ప్రభుత్వ అదనపు కార్యదర్శి శాలిని రజనీశ్

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునీకరణ సరళీకృతం కావాలని తద్వారా మానవ వనరుల సమస్యను అధిగమించవచ్చునని ప్రభుత్వ అదనపు కార్యదర్శి శాలిని రజనీశ్ అభిప్రాయపడ్డారు. అగ్రికల్చర్ ఉత్పత్తుల సంస్థల కృషి కల్ప ఎఫ్‌పీఓల ద్వారా ఏర్పాటు చేసిన యాక్సిలరేటర్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జేపీనగర్ ఆర్‌వీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కేంద్రప్రభుత్వ వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహూజా, నాబార్డు ఛైర్మన్ షాజి, అదనపు ముఖ్య కార్యదర్శి అతీక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రైతులు మార్కెట్‌లు, వనరులకోసం సంప్రదించే ఎఫ్‌పీఓలు కీలక భూమిక పోషించనున్నాయన్నారు. మార్కెట్ ఓరియంటేషన్ ట్రైనింగ్ ద్వారా ప్రాంతాలవారీగా వ్యవసాయానికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించి వాటికి అనుగుణంగా మార్కెటింగ్ చేయదలిచినట్లు తెలిపారు.



యాక్సిలరేటర్ కార్యక్రమంలో ప్రభుత్వ అదనపు కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు

నిరంతర ప్రయత్నంతోనే జీవితంలో ఎదుగుదల



తత్వ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులతో విద్యార్థులు

▸▸ దర్శకుడు రామేనహళ్ళి జగన్నాథ్

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): జీవనంలో ఏదైనా సాధించాలంటే నిరంతర ప్రయత్నం ముఖ్యమని ప్రముఖ సినీ దర్శకుడు రామేనహళ్ళి జగన్నాథ్ అభిప్రాయపడ్డారు. బనశంకరిలోని బీఎన్‌ఎంఐటీ కళాశాలలో తత్వ పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలని వందలాది ఆలోచనలు మనసుకు రావాలని, వాటిని సాకారం చేసే ప్రయత్నాలు ముఖ్యమన్నారు. సినీ దర్శకుడు కాకమునుపు ఇదే కళాశాలలో అధ్యాపకుడిగా కొనసాగానని సినిమావైపు ఆసక్తి ఉండేదన్నారు. అందుకే హొందిసి బరెయసి అనే సినిమాను చేశానన్నారు. సాహితీవేత్త సూర్యవశిష్ఠ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదివానని అప్పట్లోనే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చానన్నారు. జీవితంలో ఏదైనా సాధన అంటే చదివిన కళాశాలలోనే అధ్యాపకులతో కలసి వేదిక పంచుకోవడమన్నారు. బీఎస్‌ఎం చారిటీ ట్రస్టీలు ఈశ్వర్ మానె, డైరెక్టర్ రామమూర్తి, అదనపు డైరెక్టర్ ఎస్‌వై కులకర్ణి, జాయింట్ సెక్రటరీ అశోక్ కార్మానె, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. విద్యార్థుల సామూహిక నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎస్ఎస్ఎల్‌సీలో జ్ఞానభారతి విద్యార్థుల ప్రతిభ

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో యలహంకలోని జ్ఞానభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ అశోక్‌కుమార్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ మొత్తం 40మంది ఉండగా పదిమంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఫస్ట్‌క్లాస్‌లో 18మంది, సెకండ్‌క్లాస్‌లో ఆరుగురు, థర్డ్‌క్లాస్‌లో ముగ్గురు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ పాఠశాలలో అత్యధికంగా ప్రవాసాంధ్రులైన చేనేత కార్మిక కుటుంబాల పిల్లలు ఉన్నారన్నారు. పదిమంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులు కావడంపై ప్రత్యేకంగా అభినందించారు. హేమకిశోర్ (96శాతం), వైష్ణవి 93శాతం, యశ్వంత్‌రెడ్డి 93శాతం, సంజన 93 శాతం, ప్రసన్న లక్ష్మి 92శాతం, దీక్షిత 91శాతం, నిఖిల్ 89శాతం, తనుశ్రీ 88శాతం, నవదీప్తి 87శాతం, కార్తీక్ 86శాతంతో ఉత్తీర్ణులయ్యారన్నారు.



హేమకిశోర్, వైష్ణవి, యశ్వంత్‌రెడ్డి, సంజన, ప్రసన్న లక్ష్మి

తలదుమ్మనహళ్లిలో వైభవంగా జాతర



దీపాలతో మహిళల ఊరేగింపు

శిడ్లఘట్ట, మే 9: తాలూకాలోని తలదుమ్మనహళ్ళిలో 14ఏళ్ల అనంతరం బండి ద్యావర ఉత్సవం ఘనంగా కొనసాగుతోంది. గ్రామాన్ని అందంగా ముస్తాబు చేశారు. చౌడేశ్వరిదేవి కులబాంధవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఐదు రోజుల ఉత్సవంలో ప్రతి రోజూ ఒక్కో ఉత్సవం, ఆరాధాన, ప్రత్యేక పూజలు కొనసాగాయి. చివరిరోజు పిల్లలకు పూలు ఇచ్చే ఆచారం ఉంది. పెద్దల పేరిట వస్త్రాలు సమర్పించడం ద్వారా బండి ద్యావర ఉత్సవం ప్రారం భమైంది. రెండోరోజు మంగళవారం బలి ద్యావర నిర్వహించారు. కులస్థులంతా ఇళ్లనుంచి దీపాలను తలపై పెట్టుకుని పురవీధులలో సాగారు. వీరగారరు చౌడేశ్వరి దేవి ఉత్సవమూర్తిని ఊరేగించారు. డప్పులు, నాదస్వరం, తదితర జానపద కళాబృందాలు పాల్గొన్నాయి. దీపోత్సవానికి కళాబృందాలు సందడి తెచ్చాయి. గ్రామ శివారులో చౌడేశ్వరి దేవికి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మూడోరోజు హొసమనె ద్యావర, నాలుగో రోజు గంగ ద్యావర, ఐదు రోజు అశ్వత్థకట్టకు పూజలు, ఆరో రోజు ఇంటిముందు వంట చేసే ఆచారం, ఏడోరోజు బండి కరగ ఉత్సవం, ఎనిమిదో రోజు పిల్లలకు పూలు ఇస్తారు.

ద్వితీయ పీయూలో జేఎస్ విద్యార్థుల సత్తా

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ ఫలితాల్లో నగరంలోని జేఎస్ పీయూ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మల్లతహళ్ళిలోని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఛైర్మన్ జయరాంశెట్టిలు గురువారం మీడియాతో మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలు 28మంది ర్యాంకులు సాధించారన్నారు. 210 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులు కాగా ఫస్ట్‌క్లాస్‌లో 180మంది, సాధారణంగా 68మంది పాస్ అయ్యారన్నారు. కీర్తన.కె (99శాతం), రితు ఎస్ భట్ (98.1శాతం), రచన కోట్యాన్ (98శాతం), రమ్య ఎస్ (97.8శాతం), మోనికా సి (97.8శాతం), చేతన్ (97.8శాతం), దిశ ఎస్ (97.3శాతం), హర్షిణి ఆర్ (97.1శాతం), సౌజన్య ప్రభ బి (97.1శాతం) ఆర్యన్ కశ్యప్ (97.1శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకర్లను ప్రత్యేకంగా అభినందించారు.



కీర్తన కె, రుతు ఎస్ భట్, రచన కోట్యాన్, రమ్య ఎస్, మోనికా సి

వ్యాధుల నియంత్రణపై అవగాహనా శిబిరం

శిడ్లఘట్ట, మే 9: సీజనల్‌తో సంబంధం లేకుండా బీపీ, షుగర్ ఇతరత్రా ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాల్సి ఉందని తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశమూర్తి అభిప్రాయపడ్డారు. జిల్లా ఆరోగ్య సంక్షేమశాఖ, ఎన్‌సీడీ విభాగం, మహతి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో దిబ్బూరహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనసీజనల్ రోగాల నియంత్రణ శిబిరాన్ని నిర్వహించారు. రోగం ఏదైనా డయట్, వ్యాయామంతోపాటు సరైన ఔషధాలు ముఖ్యమన్నారు. ఇటీవలి కాలంలో బీపీ, షుగర్ వంటివి సాధారణమయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతోపాటు ఈసీజీ, కంటి పరీక్షలు, దంతాల పరీక్ష, చర్మరోగాలు, చెవుల పరీక్షలపై అవగాహన కల్పించారు. మహతి సేవా ట్రస్టు డాక్టర్ సుందరి, ప్రాథమిక కేంద్రం పాలనా వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్, తాలూకా ఆరోగ్య అధికారి దేవరాజ్, బీఎస్‌ఎం అఫ్రోజ్, మహతి ట్రస్టు కవిత, సీహెచ్‌ఓ లక్ష్మి సహా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

పునాదుల్లో జగనన్న కాలనీలు..

కూడేరు, మే 9 : గూడులేని నిరుపేదలకు గూడు కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలకు క్షేత్రస్థాయిలో ఆచరణకు ఏమాత్రం పొంతనలేదు. వైసీపీ అధికారంలోకి రాగానే జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంతో ఆర్భాటం చేశారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి గ్రామాలనే నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలికారు. చివరికి జగనన్న కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. కూడేరు మండలంలో 19 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయగా అందులో 332 గృహాలు మంజూరు చేశారు. ఇందులో 128 ఇళ్లు పూర్తికాగా, 20 ఇళ్లు గోడల వరకు నిర్మాణం చేశారు. మిగిలిన 161 ఇళ్లు బేస్‌మట్టానికి పరిమితం కాగా, 23 ఇళ్లు పునాదుల వద్దే నిలిచిపోయాయి. మండలంలోని కూడేరు 1, కూడేరు 2, కడదరకుంట, చోళసముద్రం, గొట్కూరు, రామచంద్రపురం, తిమ్మాపురం, జయపురం, ముద్దలాపురం, జల్లిపల్లి, అరవకూరు, జల్లిపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేశారు. జగనన్న లేఅవుట్లు అనువుగాని చోట మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణమే జరగలేదు. దీంతో జగనన్న కాలనీలో కంపచెట్లు పెరిగిపోయాయి. కూడేరు, అరవకూరు, ముద్దలాపురం, గొట్కూరు గ్రామాల్లో మాత్రమే కొంత నిర్మాణాలు చేపట్టగా మిగిలిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. చోళసముద్రం, రామచంద్రపురం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలే జరగలేదు. అందుకు కారణం గ్రామానికి దూరంగా స్థలాలు కేటాయించడమే. మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కంటే కంపచెట్లు అధికంగా పెరిగిపోయాయి.



కడదరకుంట గ్రామంలో కాలనీ దుస్థితి

గర్భిణికి శస్త్ర చికిత్స విజయవంతం

బంగారపేట, మే 9: ఐదు నెలల గర్భిణికి క్లిష్టమైన శస్త్ర చికిత్సను కోలారు వంశోదయ ఆసుపత్రి వైద్యులు విజయవంతం చేశారు. కామెర్ల సమస్యతోపాటు పిత్తకోశం, పిత్తనాళంలో రాళ్లు ఉండడంతో సాధారణ శస్త్ర చికిత్సకు వెనుకంజ వేశారు. కోలారులోని వంశోదయ ఆసుపత్రి గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ వినయ్, బృందం ల్యాప్రోస్కోపిక్ విధానంలో రాళ్లను తొలగించడంలో సఫలీకృతులయ్యారు. సాధారణ రోగులకు ఎక్స్‌రే ద్వారా చేస్తారు. అయితే గర్భిణి కావడంతో ఈ విధానం పాటించలేదు. కడుపులోని బిడ్డకు ఎలాంటి హాని లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం గర్భిణి కోలుకుంటోందని వైద్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐసీఎస్ఈ ఫలితాల్లో టాపర్ సహస్ర

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో గోపాలన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని సహస్ర 99.4శాతం ఫలితాలతో నగర టాపర్‌లలో ఒకరిగా నిలిచారు. సహస్ర చదువుతోపాటు పాఠ్యేతర అంశాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. కంప్యూటర్ సైన్స్‌పై ఆసక్తితో హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సీఎస్50 ఆన్‌లైన్‌లో కోర్సును చేస్తున్నారు. సంగీతంలోనూ రాణించారు. గాయనిగా పలు ఇంటర్‌స్కూల్ పోటీలలో పాల్గొని మొదటిస్థానంలో సత్తా చాటుకుంది. విద్యార్థిని ప్రతిభపై స్థానికులనుంచి ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.

వాసవీమాతకు విశేష అలంకరణ



లలితా త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు

చింతామణి, మే 9: పట్టణంలోని దొడ్డపేటలో కొలువైన శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి గురువారం విశేషపూజలు నిర్వహించారు. లలితా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రష్యన్ మహిళ మృతి

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉడుపిలో నివసిస్తున్న రష్యా దేశానికి చెందిన నల్ఫత్ బెక్టనోవా (51) బాత్రూంలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 7న సంఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. రష్యా నివాసి అయిన బెక్టనోవా 2009లో మణిపాల్‌కు చెందిన సీఎస్ఐ చర్చ్‌లో కులిన్ మహేంద్ర షా అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. ఏడాదిక్రితం మహేంద్ర షా మృతి చెందాడు. అప్పటి నుంచి బెక్టనోవా పుత్తూరులోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కుమార్తెతోపాటు నివసిస్తున్నారు. బాత్రూంలో ఆమె జారిపడి మృతి చెందారు. ఈమేరకు ఉడుపి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

▸▸ కలబురగి ఇంజనీరింగ్ పట్టభద్రుడు

మహదేవపుర, మే 9: ఉద్యోగం కోసం బెంగళూరుకు వచ్చిన ఓ యువకుడు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌గుట్టలో చోటు చేసుకుంది. కలబురగి ప్రాంతానికి చెందిన అరుణ్ కుమార్ (28) ఆత్మహత్యకు పాల్పడిన యువకుడిగా గుర్తించారు. ఇంజనీరింగ్ చేసిన అరుణ్ ఉద్యోగం కోసం మూడు రోజులక్రితం బెంగళూరుకు వచ్చాడు. స్థానిక శివా పీజీలో తన స్నేహితుడితో ఉంటున్నాడు. గురువారం ఉదయం సుమారు 10.40 గంటలకు భవనంపైకి వెళ్లి మొబైల్, చెప్పులు అక్కడే వదిలి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై వైట్‌ఫీల్డ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైదేహి ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. ఏదేమైనా ఉపాధి వెతుక్కోవడానికి వచ్చిన ఇంజనీరింగ్ పట్టభద్రుడు అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా విషాదం కల్పించింది.

ఖనిజం లూటీ..!

- సరిహద్దులు దాటిన ఇనుప ఖనిజం
- ఐదేళ్లలో రూ. 10 కోట్ల ఖనిజ దోపిడీ
- అసలు స్థానంలో నకిలీ ఉంచుతున్న వైనం
- బరితెగించిన వైసీపీ నాయకులు


రాయదుర్గం, మే 9: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండే ఇనుప కొండలను కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లుగా యథేచ్ఛగా తవ్వేశారు. దాదాపు రూ. 10 కోట్లకు పైగా విలువైన ముడిఖనిజాన్ని దోపిడీ చేసి సరి హద్దులు దాటించి జేబులు నింపుకున్నారు. డీ.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి గ్రామాలకు ఆనుకుని ఉన్న ఇనుప ముడిఖనిజపు కొండల్లో రాత్రిపూట మాత్రమే ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుం టాయి. దీని వెనుక వైసీపీ గ్యాంగ్ వ్యవహారాన్ని చక్కదిద్ది రూ.కోట్లు దోచుకుంటోంది. ఇందులో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం.


● ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి జరిగిన అవినీతి, అక్రమాల వ్యవహారంలో తవ్వకాలు సాగిస్తున్న ఇనుప కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని కూడా దోచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా సీబీఐ 1.5 లక్షల మెట్రిక్ టన్నుల విలువైన ముడి ఖనిజాన్ని సీజ్ చేసింది. అయితే నిల్వ చేసిన ప్రాంతం నుంచి ఆ ఖనిజాన్ని రాత్రి సమయాల్లో వైసీపీ నాయకుల అండతో కొందరు సరిహద్దు దాటించారు. తరలించిన ఖనిజం స్థానంలో ఏ మాత్రం పనికిరాని లో గ్రేడ్ ఖనిజమట్టిని తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి సీజ్ చేసి, నిల్వ చేయడంతో వర్షానికి అందులోని నాణ్యత తగ్గి మట్టిగా మారిందని అధికారులకు చెబుతున్నట్లు సమాచారం.

● ముడిఖనిజాన్ని అక్రమంగా తరలించేందుకు వాహనదారులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వ్యవహారంలోని ఒక పద్ధతి. వైసీపీ నాయకులు ఏ మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించకుండా టిప్పర్ల యజమానులకు పూర్తి బాధ్యతను అప్పగించి తరలించేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అక్రమంగా తవ్వకాలు చేసిన ఖనిజం, సీజ్ చేసిన ఖనిజం, ఇతర మైనింగ్ లీజు ప్రాంతాలలో నిల్వ ఉన్న ఖనిజాలను అక్కడ నుంచి లోడింగ్ చేసు కుని కర్ణాటకలోని క్రషర్లకు రవాణా చేయడం ఆయా టిప్పర్ల యజమానుల ఒప్పందంలో భాగం. రవాణాపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పూర్తి బాధ్యత టిప్పర్ యజమానులదే. అన్‌లోడింగ్ చేసిన అనంతరం దీనికి సంబంధించిన సొమ్ము వైసీపీ నాయకులు వారికి చెల్లిస్తారు. ఈ పద్ధతి ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగుతోంది.

● వైసీపీ అధికారంలో ఉండటంతో ఇనుప ముడి ఖనిజం అక్రమ తరలింపును కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కొందరు ఉన్నత స్థాయి అధికారులు ఈ దందా వెనుక క్రియాశీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముడుపులతో సరి పెట్టుకుని వ్యవహారాన్ని చూసీచూడనట్లుగా ఉంటూ వస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రం ట్రాక్టర్లను పట్టుకువచ్చి చిన్నపాటి కేసులు పెట్టి వదిలేసినట్లు పోలీసులపై ఆరోపణలున్నాయి. పైగా పోలీ సులకు నెలవారి మామూళ్లు కూడా చెల్లిస్తూ వచ్చినట్లు వైసీపీ నాయకు లపై ఆరోపణలు వస్తున్నాయి. ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగిన ముడి ఖనిజపు లూటీ దందాలో కొందరు వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తి కర్ణాటకలో దర్జాగా వ్యాపార వ్యవహారాలను నిర్వహించుకుంటున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది.

ఇనుప ముడిఖనిజం కొండలు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.69	1,576.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1272
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	138	113
సామర్థ్యం (టీఎంసీలు)	3.45	2.83

పిడుగు పాటుకు కాడెద్దుల మృతి



పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఎద్దులు

బళ్లారి సిటీ, మే 9: బళ్లారి తాలూకా కప్పగల్‌లో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతిచెందాయి. బళ్లారి పరిధిలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. అదే సమయంలో కప్పగల్ గ్రామానికి చెందిన దొడ్డబసప్పకు చెందిన ఎద్దులు ఆరుబయట ఉండడంతో వాటిపై పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాయి. ఎద్దులు మృతిచెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరాడు.

కుడితినిలో తీవ్ర నీటి ఎద్దడి

కంప్లి, మే 9 : కుడితిని పట్టణంలోని 19వ వార్డులో నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు వారానికి ఒకసారి కూడా నీరు రావడం లేదని ఒడకప్ప, శివమ్మ, నీలమ్మ, శంకరమ్మ, శారదమ్మ, లక్ష్మీ, సుశీల తదితరులు గురువారం కుడితిని పట్టణ పంచాయతీ అధికారులకు మనవిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, బయట పనులకు వెళితేనే తమకు జీవనం గడుస్తుందని, దీనికి తోడు నీటి సమస్యవుండటం వల్ల ప్రతినిత్యం పట్టణ పంచాయతీ నుండి నీరు ఎప్పుడు వదులుతారో తెలియక ఇళ్లకే పరిమితమయ్యామన్నారు. కొందరు అంగవికలాంగులు, వృద్ధులు నీరు తెచ్చేవారు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఏర్పడిందని, ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను దృష్టిలో వుంచుకుని సక్రమంగా నీరు వదిలేలా చూడాలని కోరారు.

పోస్టల్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, మే 9 : పోస్టల్ శాఖ ఎన్నెన్నో ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు సిరుగుప్ప తాలుకా హెడ్ పోస్టు మాస్టర్ మంజునాథ శెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం సిరుగుప్ప హెడ్‌పోస్టాఫీసులో సర్వసభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోస్టుమాస్టర్ మాట్లాడుతూ హెడ్ పోస్టాఫీసు నుంచి ఆధార్ కార్డులో తప్పులను సరిచేయడం, టికెట్ బుకింగ్, పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్టాఫీసు శాఖ సర్వసభ్యులు అబ్దుల్ నబీ, హనుమంతరెడ్డి, నౌషద్ అలీ, సిబ్బంది, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు డిమాండ్

బళ్లారి సిటీ, మే 9: బళ్లారి జిల్లాలో రోజురోజుకు ఎండలు పెరిగి జనం అల్లాడిపోతున్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 44సెల్సియస్ నమోదవుతోంది. మధ్యాహ్నం సమయంలో జనం బయటకు రాని పరిస్థితి నెలకొంది. వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలు మంచినీరు, పలు రకాల పండ్ల రసాలు, చెరుకు పాలు, శీతల పానీయాలను ఆశ్రయించడం సర్వసాధారణం. అందులో తాటి ముంజల వ్యాపారానికి కూడా గిరాకి పెరిగింది. ఆదోని, కోసగి, కౌతాళం, ఉరుకుంది, హలూరు, సిరుగుప్ప తాలూకా చుట్టు ప్రక్కల తాటి చెట్లు విస్తారంగా ఉన్నాయి. గ్రామ చుట్టు ప్రక్కల ఉన్న మహిళలు గంపలలో తాటి ముంజలను నగరానికి తెచ్చి విక్రయించి సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతుంటారు. నగరంలోని సెంట్రల్ బస్టాండ్, మహాత్మగాంది సర్కిల్, బళ్లారిలోని ప్రధాన సర్కిల్లో ముంజలను విక్రయిస్తారు. డజన్ రూ.50 చొప్పున అమ్ముతామని వ్యాపారులు తెలిపారు.

కమాన్! స్టార్ట్ వన్.. టూ.. త్రీ!

ఆకట్టుకున్న పారామిలిటరీ కమాండోల విన్యాసాలు

- ఆరువేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ సాయంతో కిందకుదూకిన సైనం



బళ్లారి తాలుకా పరిధిలోని కారేకల్లు, వీరాపురం వ్యవసాయ పొలాల్లో పారామిలిటరీ కమాండోల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని ఈ పొలాల్లో బెంగళూరు విమానాశ్రయం ద్వారా వచ్చిన విమానం నుంచి పారామిలిటరీ కమాండోలు పారాచ్యూట్ ధరించి కిందకు దూకారు. సుమారు ఆరు వేల అడుగుల ఎత్తు నుండి 250 మంది కమెండోలు దూకడం స్థానికులను బాగా ఆకట్టుకుంది. మిలిటరీ బలగాలకు శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ స్థలం అనుకూలంగా ఉన్నందువలన ప్రతి సంవత్సరం మే నెలలో కమాండోలు ఇలా విమానం నుండి పారాచ్యూట్ సహాయంతో నేలపైకి దూకడాన్ని అభ్యాసం చేస్తారు. ఈ కార్యక్రమానికి పీడీహళ్లి ఎస్ఐ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. -- బళ్లారి రూరల్

ఎస్ఎస్ఎల్సీ ఫలితాల్లో 28వ స్థానంలో బళ్ళారి

- ఆఖరి స్థానాలకే పరిమితమైన కళ్యాణ కర్ణాటక
- 27వ స్థానంలో విజయనగర జిల్లా
- విద్యాభివృద్ధికి ఏటా కోట్లాది రూపాయల ఖర్చు

బళ్లారి గాంధీనగర్, మే 9: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం విడుదలైన ఎస్ఎస్ఎల్సీ ఫలితాల్లో బళ్ళారి జిల్లా 28 స్థానంలో నిలిచింది. ఈ సారి ఫలితాలు కళ్యాణ కర్ణాటక విభాగంలోని జిల్లాలకు చేదు అనుభవం తీసుకొచ్చాయని చెప్పవచ్చు. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాలు ఆఖరి స్థానాలకే పరిమితం కావడంతో పైన చూసేదానికన్నా ఆఖరి వరుసలు చూడడమే అలవాటైందని చెప్పవచ్చు. ఈ ఏడాది కూడా కళ్యాణ కర్ణాటక జిల్లాలు ఆఖరి వరుసలకే పరిమితమయ్యాయి. విద్యాభివృద్ధి కోసం ఏటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నా.. ఈ జిల్లాలు మాత్రం ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉంటున్నాయి. ఎస్ఎస్ఎల్సీ ఫలితాల్లో ఉడిపి మొదటి స్థానంలో నిలవగా, కళ్యాణ కర్ణాటక భాగంలో యాదగిరి జిల్లా 35వ స్థానంలో నిలిచింది. యాదృశ్చికం ఏమిటంటే.. రాష్ట్రంలో ఉన్న జిల్లాల్లో చివరి జిల్లా యాదగిరి కాగా... విద్యాభివృద్ధిలో కూడా యాదగిరి ఆఖరి జిల్లా కావడం గమనార్హం. మిగిలిన జిల్లాలతో పోలిస్తే గత ఏడాది 29వ స్థానంలో ఉన్న గుల్బర్గా ప్రస్తుతం 34 స్థానానికి వెళ్ళగా, బీదర్ 33వ స్థానానికి వెళ్ళింది. గత ఏడాది 16వ స్థానంలో ఉన్న కొప్పళ జిల్లా ఒకే సారి 32వ స్థానానికి పడిపోయింది. గత ఏడాది 30వ స్థానంలో ఉన్న రాయచూరు జిల్లా ఈ సారి ఒక మెట్టు ఎక్కి 31వ స్థానానికి చేరుకుంది విజయనగర, బళ్ళారి జిల్లాలు వరుసగా 27,28 స్థానాలో నిలిచి పోయాయి. ఈ పరిస్థితి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

దిష్టిబొమ్మలా ఆర్‌వో ప్లాంటు



చిన్నాపురంలో మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంటు

కంప్లి, మే 9 : గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వాలు లక్షల వ్యయంతో మంచినీటి ఆర్‌వో ప్లాంటును ఏర్పాటు చేశాయి. కానీ కంప్లి తాలుకా మెట్రి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నాపురం గ్రామంలో ఆర్‌వో ప్లాంటు దిష్టిబొమ్మగా నిలిచిపోయింది. అందులో నుంచి గుక్కెడు నీరు కూడా తీసుకోలేక పోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వంద కుటుంబాలు 600 జన సంఖ్య వుండే ఈ చిన్నాపురం గ్రామంలో నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇదిగో అదిగో మరమ్మతులు చేయిస్తామని మాటలు చెబుతారేకాని ఇంతవరకు ధ్వంసమైన ఆర్‌వో ప్లాంటుకు మరమ్మతు చేయించలేకపోయారంటున్నారు.. ప్రతి నిత్యం పక్కనే వున్న మెట్రి గ్రామానికి వెళ్లి వాహనాలలో నీటిని తెచ్చుకోవాల్సిన పరి ఏర్పడిందన్నారు. అంగవికలాంగులు, వృద్ధులు వున్న ఇళ్ల వారు బయటకి వెళ్లి నీటిని తెచ్చుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని తాలుకా పంచాయతీ అధికారులు, జిల్లా అధికారులు వెంటనే ధ్వంసమైన ఆర్‌వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి గ్రామానికి నీరు వచ్చేలా చూడాలని కోరారు.

అర్ధంతరంగా ఆగిన బసవేశ్వర విగ్రహ నిర్మాణం



సగంలోనే ఆగిపోయిన బసవేశ్వర విగ్రహ నిర్మాణ పనులు

బళ్లారి గాంధీనగర్, మే 9: చిత్రదుర్గ నగరంలోని మురుఘా మఠం ఆవరణంలో 375 అడుగుల ఎత్తుగల బసవేశ్వర విగ్రహ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విగ్రహ నిర్మాణం కోసం 2011లో ఈ బృహత్‌స్థాయి ప్రాజెక్టును రూ. 280 కోట్ల వ్యయంతో మురుఘా మఠం చేపట్టింది. అందులో పీఠం స్థాపనకు 90.2కోట్లు, ప్రతిమ నిర్మాణానికి రూ 190కోట్లు ఖర్చు చేయాలని ప్రణాళికలు రూపొందించారు.

అయితే బసవేశ్వర ప్రతిమ నిర్మాణంలో ప్రభుత్వ నిధులు సరిగా వినియోగం కాలేదని, ప్రాజెక్టు పూర్తి చేయడంలో మురుఘా మఠం నిర్లక్ష్యం చేసిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని మాజీ మంత్రి హెచ్.ఏ కాంతయ్య చిత్రదుర్గ జిల్లాధికారి వెంకటేష్‌కు లేఖ రాశారు. దీనిపై స్పందించిన జిల్లాధికారి, జిల్లాసహాయాధికారి బి.టి. కుమారస్వామి నేతృత్వంలో పరిశీలనా సమితిని ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని కోరారు. పరిశీలనా సమితి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు సేకరించి ఈ నెల 7వ తేదీన జిల్లాధికారికి నివేదిక అందజేసింది. నివేదికలో బసవేశ్వర విగ్రహ నిర్మాణం పనులు 12సంవత్సరాలు గడిచినా ప్రగతి సాధించలేదని పేర్కొంది. రాబోయే రోజుల్లో పనులు పూర్తి కావడం అనుమానమేనని సమితి నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 2011- నుండి 2023 వరకు ప్రభుత్వం నుండి రూ40కోట్లు నిధులు విడుదల అయ్యాయని, ఇందులో ఇప్పటి వరకు రూ 35కోట్లు మురుఘా మఠానికి అందజేయగా, రూ 5కోట్ల రూపాయలు పంచాయతీ ఇంజనీరింగ్ విభాగానికి అందినట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ 24.5కోట్ల నిధులు ఖర్చుచేసినట్లు మురుఘా మఠం పేర్కొన్నప్పటికీ ఈ ఖర్చుకు సంబంధించి సరైన రుజువులు లేవని పేర్కొంది. బ్యాంకు ఖాతానుండి వివిధ సంస్థలకు, నిధులు చెల్లించినట్లు ఆధారాలు ఉన్నా... ఆ చెల్లింపులు ఈ ప్రాజెక్టుకు సంబంధించినవా.. కావా? అనే విషయం తెలియాల్సి ఉందని సమితి నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ప్రతిమ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మినహాయించి మిగిలిన 240.2కోట్ల రూపాయలు ఎలా సేకరించాలనే విషయమై మఠం వద్ద సరైన ప్రణాళిక లేదని సమితి గుర్తించింది. నిధుల సంగ్రహణకు మఠం ప్రయత్నించలేని కారణంగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిగా వినియోగం కాలేదనే విషయం సమితి స్పష్టం చేసింది. పనులు ప్రారంభమై దశాబ్దం పైబడినా... పనులు మందగతిన సాగుతుండడం పట్ల సమితి అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయంపై జిల్లాధికారి స్పందిస్తూ.. పనులు జాప్యానికి సంబంధించి టెక్నికల్ నివేదికలు ఇవ్వాలని ప్రజా పనుల శాఖను ఆదేశించారు.

గోశాలల్లో పశుగ్రాసం కొరత



అనంతపురం జిల్లా నుంచి పశుగ్రాసంతో వస్తున్న వాహనాలు..

బళ్లారి గాంధీనగర్, మే 9: గత ఏడాది వర్షాలు కురవని కారణంగా పంటలు ఎండిపోవడంతో పశుగ్రాసం దొరకని స్థితిలో రైతుల అల్లాడుతున్నారు. చిత్రదుర్గ జిల్లాలో వర్షాధారిత భూములే ఎక్కువగా ఉండడంతో జిల్లాలో కరువు తాండవం చేస్తోంది. ఒకవైపు కరువు రైతులను పట్టిపీడిస్తుంటే.. మరోవైపు రైతులు వ్యవసాగులో ప్రధాన పాత్ర పోషిస్తున్న మూగజీవుల సంరక్షణ చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోశాలలు పశువులు లేక సన్నగిలుతున్నాయి. చిత్రదుర్గ జిల్లా పరిధిలోని మొళకాల్మూరు తాలూకా పరిధిలో గత ఏడాది 8 గోశాలలు ఏర్పాటు చేశారు. రైతుల డిమాండ్ మేరకు పశుగ్రాసం బ్యాంకులు తెరవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. తెరచిన గోశాలలో నీడలేక ఎండవేడిమిని తట్టుకోలేక పశువులు మృతి చెందే పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిసున్నారు. తాలూకాలో 25 నుండి 30 కిలోమీటర్ల దూరంలో గోశాలలు ప్రారంభించడం వలన అక్కరకు రాని చుట్టాలుగా గోశాలలు తయారయ్యాయని మొళకాల్మూరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం కోసం పశువులతో 30కిలోమీటర్ల దూరం ఎలా వెళ్లాలని రైతులు దిగులు చెందుతున్నారు. అనంతపురం జిల్లా నుండి పశుగ్రాసాన్ని కొనితెచ్చుకుని పశువులను కాపాడుకుంటున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి

కంప్లీ, బళ్లారి సిటీ, గాంధీనగర్, మే 9: విజయనగర జిల్లా హొసపేట తాలూకా పరిధిలో బుధవారం రాత్రి భారీగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసిన కారణంగా వందలాది ఎకరాల్లో సాగుచేసిన అరటి నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. హంపి సమీపంలోని బుక్కసాగర చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అరటి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులకు తోడు గాలి తోడుకావడంతో కోతదశలో ఉన్న అరటిపంట నేలకొరగడం రైతులు కంట నీరు తెస్తోంది. మూడు సంవత్సరాల క్రితం ఇదే రీతిలో భారీ వర్షాల కారణంగా ఈ భాగంలో అరటిపంట పంటనష్టపోయినట్లు స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుక్కసాగర్‌కు చెందిన హనుమంతప్ప అనే రైతుకు చెందిన ఎకరన్నర అరటి తోట గాలికి నేలకూలింది. పంట చేతికొచ్చే దశలో ఈనష్టం జరిగిందని, ప్రభుత్వం తమకు పరిహారం ఇవ్వాలని అతడు కోరుతున్నాడు. బుక్కసాగర్ గ్రామంలో కాళిదాసు రెండు ఎకరాల్లో అరటి సాగు చేయగా, అదికూడా గాలికి నేలకొరిగింది. జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫి చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హరిత సేన తాలూకా విభాగం అధ్యక్షుడు రుద్రప్ప డిమాండ్ చేశారు.



భారీ వర్షాల కారణంగా నేలకొరిగిన అరటి పంట..

హోసూరు జోన్

రెవెన్యూ అర్జీలను పరిష్కరించాలి



సమీక్షా సమావేశంలో కలెక్టర్ కె.ఎం.సరయు

హోసూరు (కృష్ణగిరి), మే 9: రెవెన్యూ శాఖకు సంబంధించిన సీనియర్ సిటిజన్లు సమర్పించిన అర్జీలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ కేఎం సరయు సూచించారు. రెవెన్యూ శాఖ సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు సలహా సూచనలు చేశారు. జనన మరణాల నమోదు. ప్రభుత్వ భవనాల మంజూరు, మోటారు వాహన ప్రమాద పరిహారం, యు.టి.ఆర్. అప్పీల్, పట్టా బదిలీ, సామాజిక ధ్రువీకరణ పత్రం, భూమి సేకరణ, కుటుంబ కార్డు లబ్ధిదారుల వివరాలు, స్మార్ట్ కార్డ్ పంపిణీ పనులు, గ్రీన్ కమిటీ, కొండ ప్రాంత పరిరక్షణ కమిటీ, హౌసింగ్ పట్టాల మంజూరు వంటి అంశాలను ప్రస్తావించారు. భూ ఆక్రమణను తొలగించాలన్నారు. దేవదాయ శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న లీజు మార్పు, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్ జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్ప, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, కృష్ణగిరి రెవిన్యూ కమీషనర్ సి.బాబు, డిప్యూటీ కలెక్టర్ పన్నీల్ సెల్వం, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ సుందర్ రాజ్, జిల్లా ఆది ద్రావిడర్ గిరిజన సంక్షేమ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీ విజేతకు అభినందన

హోసూరు(కృష్ణగిరి), మే 9: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో గత నెలలో జరిగిన జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో (2023-24) ద్వితీయ స్థానంలో నిలిచిన వేప్పనహళ్ళి పంచాయతీ యూనియన్ భూతిముట్లకు చెందిన దివ్యాంగురాలికి కలెక్టర్ సరయు స్వయంగా ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ జనరల్ పుష్ప, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్ పాల్గొన్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు

హోసూరు(క్రైం), మే 9: హోసూరులో ఆహారశాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలో నిషేధించిన పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని దుకాణాలకు సీల్ వేశారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు ఆదేశాల మేరకు జిల్లా నామినేటింగ్ అధికారి డాక్టర్ వెంకటేశం సూచనతో హోసూరు ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్, తళి ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుకుమార్, హోసూరు నగర పోలీసు విభాగం ఎస్ఐ ప్రభాకరన్, పోలీస్ స్పెషల్ కానిస్టేబుళ్లు సెల్వరాజ్, షణ్ముగంలు కార్యాచరణలో పాల్గొన్నారు. హోసూరు బజార్, ఫార్మర్ మార్కెట్ రోడ్, బాగలూరు రోడ్, హోసూరు బస్ స్టేషన్ ఇతర ప్రాంతాలల్లో, పెట్టెల దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధించిన గుట్కా, ఇతర ఉత్పత్తులను గుర్తించారు. అలాగే హోసూరు పరిసర ప్రాంతాలు, కెలమంగలం ప్రాంతంలో 50 దుకాణాలకు సీల్ వేశారు. ఈ విషయంపై ఆహార భద్రతా విభాగం తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దుకాణాలకు సీలు వేయడమే కాక, లైసెన్సులను రద్దు చేయాలని సిఫారసు చేశామని ఇలాగే కొనసాగితే శాశ్వతంగా మూసివేస్తామని హెచ్చరించారు.



ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేస్తున్న దృశ్యం

టెన్త్ ఫలితాల్లో రాయచూరుకు 31వ స్థానం



జ్యోతి



యరగేరా ఆదీల్

రాయచూరు, మే 9 : 2023-24 విద్య సంవత్సరానికి సంబంధించి టెన్త్ పరీక్ష పలితాలు గురువారం వెల్లడైయ్యాయి.61.20 శాతంతో రాయచూరు జిల్లా రాష్ట్రంలో 31వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 84.06 శాతంలో 30వ స్థానంలో నిలిచిన జిల్లా ఈ ఏడాది మరొక స్థానం దిగువకు వెళ్లడం గమనార్హం. కాగా ఫలితాల్లో ఎప్పటి మాదరిగానే బాలికలు పైచేయి నిలవగా బాలురు రెండవ స్థానంలో నిలిచారు. గ్రామీణ ప్రాంతాల్లో సహితం ఉత్తీర్ణతలో బాలికలే పైచేయిగా నిలువడం విశేషం. జిల్లాలో గత మార్చి నెలలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 31,188 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 19,087 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారు. కాగా పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అధికారులు జూన్ 7వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు నిర్దేశిత ఫీజును గడువులో చెల్లించి పరీక్షలకు సిద్ధకావాలని సార్వజనిక శిక్షణ శాఖ అధికారులు తెలిపారు. జ్యోతి, ఆదీల్ అత్యధిక మార్కులు ప్రకటించిన టెన్త్ ఫలితాల్లో జిల్లాలోని సింధనూరు తాలూకా ఒళ బళ్ళారికి చెందిన జ్యోతితో పాటు నగరంలోని ఎస్ఆర్‌పీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి యరగేరా ఆదీల్ 620కి గాను 618 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌లుగా నిలిచారు.

ఎండిపోయి ఎడారిగా మారిన మర్చెడ్ చెరువు

రాయచూరు, మే 9 : తాలూకాలోని అతి పెద్ద చెరువుగా పేరున్న మర్చెడ్ చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఈ ఏడాది ఎదురైన వర్షభావ పరిస్థితి వల్ల చెరువు పూర్తి స్థాయిలో నిండకపోగా ఇటీవలే చెరువులో ఉన్న నీరంతా ఎండిపోగా లక్షల సంఖ్యల్లో ఉన్న చేపలు ఒడ్డున పడి విలవిలలాడుతూ మృత్యువాత పడ్డాయి. దీంతో రైతులు వ్యవసాయ అనుబంధంగా చేపల పెంపకం ఆసరాను కోల్పోయి హతాశులయ్యారు. దాదాపు 4.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మర్చెడ్ చెరువులో గత కాలంలో దాదాపు రూ.15 లక్షలు వ్యయం చేసి సమీప గ్రామానికి చెందిన అనేక మంది రైతులు చేపల పెంపకం సాగించారు. ప్రతి ఏట చేపల పెంపకం ద్వార సిరిగా ఆదాయం పొందే రైతులకు ఈ ఏడాది వర్షభావ పరిస్థితి శాపంగా మారింది. ఎడారిగా మారిన మర్చెడ్ చెరువులో గుట్టలు గుట్టలుగా పడిఉన్న చనిపోయిన చేపలను చూసి రైతులు కంటతడిపెడుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవాలని చేపల పెంపకం దారులు కోరుతున్నారు.



లక్షల సంఖ్యలో మృత్యువాత పడిన చేపలు